

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
గురువారం 13 మార్చి 2025





బ్రహ్మోత్సవాల్లో భక్తుల రద్దీ
● గోదావరి నదిలో పుణ్య స్నానాలు
7
ముమ్మరంగా ఉపాధిహామీ పనులు
● జిల్లాలో మొదటి స్థానంలో మల్యాల

పాఠశాలల్లో ఏఐ బోధన

- ఈనెల 15వ తేదీ నుంచి అమలు
- జిల్లాలో 21 పాఠశాలలు ఎంపిక
- 3,4,5 తరగతుల విద్యార్థుల సామర్థ్యాల మెరుగునకు చర్యలు
- ఉపాధ్యాయులకు పూర్తయిన శిక్షణ



జగిత్యాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగు పరిచేందుకు ప్రభుత్వం ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్) బోధనకు నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఏఐ (కృత్రిమమేధ) హవా నడుస్తోంది. ఈ అత్యాధునిక సాంకేతిక సాయంతో ప్రాథమిక విద్య బలోపేతానికి చర్యలు తీసుకోనుంది. ఇప్పటికే పైలెట్ ప్రాజెక్టుగా పలు జిల్లాలోని 10పాఠశాలల్లో ఏఐ బోధన చేపడుతుండగా, ఇకపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అమలు చేయాలని నిర్ణయించింది. ఇందు కోసం జిల్లా వ్యాప్తంగా ఉన్నత పాఠశాలలున్న అతి సమీపంలోని 21 పాఠశాలలను ఎంపిక చేశారు. నిపుణులైన ఉపాధ్యాయులకు, జిల్లా సమన్వయ అధికారులకు ఈనెల 11వ తేదీన ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఈ నెల 15వ తేదీ నుంచి ఎంపికైన పాఠశాలల్లో ఏఐ బోధనకు అమలుకు చర్యలు తీసుకుంటున్నారు.

● 3,4,5 తరగతుల వారికి....

ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో ఆశించిన స్థాయిలో అభ్యసనా సామర్థ్యాలు, వివిధప్రక్రియల్లో వెనుక బాటుకు గురవుతున్నారు. పలురకాల కార్యక్రమాలు అమలు చేస్తున్నా సామర్థ్యాలు మెరుగుపడడం లేదు. ఈ నేపథ్యంలో కృత్రిమ మేథ సాయంతో 3వ, 4వ, 5వతరగతుల విద్యార్థుల్లో మెరుగైన సామర్థ్యాల కోసం చర్యలు తీసుకుంటారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా ఉన్నత పాఠశాలలున్న అతి సమీపంలోని 21 పాఠ శాలలను ఎంపిక చేశారు. జిల్లాలో ఒక్కో మండలంలో ఒక్కో పాఠశాలను, పలు మండలాల్లో నాలుగు వరకు సైతం పాఠశాలలను ఎంపిక చేశారు. ఆయా తరగ తుల్లో వెనుకబడిన సుమారు 1,165మంది విద్యార్థులను గుర్తించారు. ఒక్కో పాఠశాలలో ఐదు కంప్యూటర్లను అందుబాటులో ఉంచారు. ఈకే-స్టెప్ అనే కంపెనీ సహకారంతో ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా ఏఐ బోధన అందిస్తారు. ఇందుకోసం ఆ పాఠశాలల్లో లేదా పక్కన ఉన్న ఉన్నత పాఠశాలల్లోని కంప్యూటర్లను ఉపయోగించడానికి నిర్ణయించారు. ఎంపిక చేసిన పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయుడితో పాటు ఒక ఉపాధ్యాయుడికి ఏఐ బోధన విధానంపై శిక్షణ ఇస్తున్నారు.

మండలం	ఎంపిక చేసిన పాఠశాల	విద్యార్థుల సంఖ్య
కథలాపూర్	బొమ్మెన	122
కథలాపూర్	సిరికొండ	100
కోరుట్ల	చిన్నమెట్‌పల్లి	75
గొల్లపల్లి	రాఘవపట్నం	69
కథలాపూర్	తక్కలపల్లి	68
జగిత్యాలరూరల్	పొలాస	64
జగిత్యాల రూరల్	జాబితాపూర్	59
వెల్గటూరు	కొండాపూర్	56
ఇబ్రహీంపట్నం	తిమ్మాపూర్	50
మెట్‌పల్లి	మేడిపల్లి(పడమర)	50
కోరుట్ల	జోగినిపల్లి	49
మల్లాపూర్	కొత్తదాంరాజ్‌పల్లి	46
మెట్‌పల్లి	వేంపేట	44
గొల్లపల్లి	ఇబ్రహీంనగర్	42
గొల్లపల్లి	చెందోలి	40
గొల్లపల్లి	అగ్గిమల్ల	33
కోరుట్ల	వెంకటాపూర్	33
మేడిపల్లి	దమ్మన్నపేట	25
బుగ్గారం	మద్దునూరు	18
ఇబ్రహీంపట్నం	ఎర్దండి	12
జగిత్యాల	దరూర్	110
	మొత్తం	1,165

● బోధన ఇలా...

ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో పిల్లలను ఆకట్టుకనేలా ఏఐ బోధన చేస్తుంది. ఎంపిక చేసిన 3వ, 4వ, 5వ తరగతుల వారిని ఐదుగురికి ఒక బ్యాచ్ ఏర్పాటు చేస్తారు. ఒక్కో బ్యాచ్‌కు తెలుగు వాచకం, గణిత అభ్యాసాలపై 20 నిమిషాల వ్యవధిలో ఏఐ పాఠాలు బోధిస్తుంది. ఆ విద్యార్థి అర్థం చేసుకుంటున్నాడా..? లేదా అని ఏఐ గుర్తించి అర్థం కాకపోతే ...

మిగతా 8లో

దరఖాస్తుల ఆహ్వానం

కోరుట్ల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతంలోని సాంఘిక సంక్షేమ గురుకుల వ్యవసాయ (అగ్రికల్చర్) కళాశా లలో సంబంధిత సబ్జెక్టు మహిళా అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల డీన్ డాక్టర్ జి. సుబ్బిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ ఎడ్యుకేషన్, అనిమల్ హస్బెం డ్రీ సబ్జెక్టులు బోధించడానికి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీన్ డాక్టర్ సుబ్బిరెడ్డి తెలిపారు. ఈ నెల 17న సంబం ధిత సర్టిఫికెట్లతో కళాశాలలో ఉదయం 10 గంటలకు నిర్వహించే డెమోకు హాజరు కావాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలను సెల్ నంబర్ 9959247652లో సంప్రదించాలన్నారు.

అట్రాసిటీ కేసుల బాధితులకు రూ.45.75 లక్షల విడుదల

జగిత్యాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదు అయిన అట్రాసిటీ కేసుల బాధితులకు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయానికి సంబంధించి రూ.45.75 లక్షల నిధులను బుధవారం ప్రభుత్వం విడుదల చేసింది. జిల్లాలో 95మంది బాధితులకు రూ. 45,75,000 నిధులను విడుదల చేసింది. వారం, పది రోజుల్లో మరికొంత నిధులు విడుదల కానున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

సామాజిక సేవ అందరి బాధ్యత

జగిత్యాల అగ్రికల్చర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సామాజిక సేవను బాధ్యతగా స్వీకరించాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిజామాబాద్ రీజనల్ హెడ్ అరుణ సవిత అన్నారు. పట్టణంలోని అయిదు ఎస్సీ హాస్టల్స్‌లకు యూబీఐ ఆధ్వర్యంలో వాటర్ డిస్పెన్సర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివి మంచి మార్కులు సంపాదించాలన్నారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ అధికారి రాజు కుమార్, ఎల్‌డీఎం రాం కుమార్, యూబీఐ వివిధ శాఖల మేనేజర్లు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యవర్గం

జగిత్యాల అగ్రికల్చర్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలో బుధవారం స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జ్యోతి హైస్కూల్ ఐఐటీ అకాడమీలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర పరిశీలకుడిగా వచ్చిన ఏఎస్ఓసీ వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాశాఖ అధికారి రాము ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. స్కౌట్ జిల్లా కమిషనర్‌గా బియాల హరిచరణ్‌రావు, జిల్లా కార్యదర్శిగా కొలగాని మధుసూదన్, సంయుక్త కార్యదర్శిగా జమున రాణి, గైడ్స్ కమిషనర్ అజితారావు, క్లబ్స్ కమిషనర్ వినోద్ గౌడ్, కోశాధికారిగా శనర్సయ్య, స్కౌట్ ఆర్గనైజింగ్ కమిషనర్ వెంకటేశ్వర్లు, గైడ్స్ ఆర్గనైజింగ్ కమిషనర్ పద్మజ, స్కౌట్ ట్రైనింగ్ కమిషనర్ నాగరాజు, గైడ్స్ ట్రైనింగ్ కమిషనర్ సంగీత లను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యవర్గ సభ్యులను డీఈవో రాము, ఏఎస్ఓసీ వెంకటేశ్వర్లు అభినందనలు తెలిపారు. ఎన్నికైన సభ్యుల పదవీకాలం ఐదేళ్లు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తున్న కబ్ మాస్టర్స్, స్కౌట్ మాస్టర్స్‌తో పాటు గైడ్ కెప్టెన్స్ పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి

● కలెక్టర్ సత్య ప్రసాద్

జగిత్యాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, పంచాయతీల్లో ఎల్ఆర్ఎస్‌లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి మున్సిపల్ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, మండల పంచాయతీ అధికారులతో ఆయన జూమ్ మీటింగ్ నిర్వహించి సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల రుసుము చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ పంచాయతీలో కనీసం 50 దరఖాస్తులకు ఎల్ఆర్ఎస్ రుసుము చెల్లించేలా అధికారులు పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహిస్తున్న కలెక్టర్ సత్య ప్రసాద్

ఎస్సెస్సీలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

జగిత్యాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి జిల్లాలోని వివిధ పాఠశాలల పదోతరగతి విద్యార్థులతో వర్చ్యువల్ (జూమ్) సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎటువంటి భయాందోళన చెందకుండా పరీక్షలు రాయాలన్నారు. ఉపాధ్యాయులు సూచించిన మెళకువలను పాటించి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలె క్టర్ బీఎస్ లత, జిల్లా విద్యాధికారి రాము, జిల్లా కోఆర్డినేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకర్లు రుణ లక్ష్యాలను సాధించాలి

● అదనపు కలెక్టర్ బీఎస్ లత

జగిత్యాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించిన రుణ లక్ష్యాలను సాధించడానికి బ్యాంకర్లు కృషి చేయాలని అదనపు కలెక్టర్ బీఎస్‌లత అన్నారు. బుధవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గల ఆడిటోరియంలో జిల్లా సమన్వయ కమిటీ త్రైమాసిక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పథకాల అమలులో బ్యాంకర్లు ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదన్నారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌కుమార్, నాబార్డ్ డీడీఎం దిలీప్ చంద్ర, ఆర్‌బీఐ ఎల్‌డీఓ పృథ్వి, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు రాజు కుమార్, డాక్టర్ బోనగిరి నరేశ్, డాక్టర్ కిషోర్, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత

ఈజీఎస్ కూలీల సంఖ్య పెంచాలి

● డీఆర్‌డీవో రఘువరణ్

కొడిమ్యాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనులకు కూలీల సంఖ్యను మరింత పెంచాలని డీఆర్‌డీవో రఘువరణ్ అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని రామకిష్టాపూర్ గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను డీఆర్‌డీవో పరిశీలించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో మాట్లాడుతూ రోజు రోజుకు పెరుగుతున్న ఎండ తీవ్రతకు ఉపాధి కూలీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పండ్ల తోటల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పశువుల షెడ్ల నిర్మాణానికి ఆసక్తి గల వారు ముందుకు రావాలన్నారు. 100 రోజులు పని పూర్తి చేసిన కూలీలు ఉన్నతి కార్యక్రమానికి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అనంతరం కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు.

మండలంలో పెద్దపులి సంచారం ఉందన్న నేపథ్యంలో కూలీలు పనులకు వెళ్లేటప్పుడు శబ్దం చేసుకుంటూ వెళ్లాలన్నారు. పురుషులు ఎక్కువగా పనులకు వచ్చే విధంగా అధికారులు అవగాహన కల్పించాలన్నారు. డీఆర్‌డీవో వెంట ఎంపీడీవో స్వరూప, ఏపీవో సతీష్, ఈసీ రమాపతి, టీఏ శ్రీనివాస్, కార్యదర్శి మహేష్, ఫీల్డ్ అసిస్టెంట్ బాలయ్య, కూలీలు ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

జగిత్యాలరూరల్, మార్చి 12 : మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి రఘువరణ్ అన్నారు. జగిత్యాల మండల ఐకేపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మహిళ దినోత్సవానికి రఘువరణ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతూ మహిళలకు పెద్దపీట వేస్తోందన్నారు. మహిళా సంఘా లకు ఇందిరా మహిళశక్తి ద్వారా ఆర్టీసీ బస్సులు, సోలార్ విద్యుత్‌ప్లాంట్ల ఏర్పాటు వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టిందన్నారు. డీపీఎం మానిక్ రెడ్డి, ఏపీఎం గంగాధర్, డీఎంజీ దేవ య్య, సీసీలు గంగారాం, రవీందర్ ఉన్నారు.

మూగజీవాలకు వైద్య సేవలు అందించాలి



పశువైద్య కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ నరేష్

పెగడపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మూగ జీవాలకు సక్రమంగా వైద్య సేవలందించాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎ.నరేష్ పేర్కొన్నారు. బుధవారం పెగడపల్లి మండల కేంద్రంలోని మండల పశువైద్య కేంద్రాన్ని అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ నరేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలంలో పశు సంపద, మూగజీవాలకు అందుతున్న వైద్య సేవలు అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల పట్ల రైతులకు అవగాహన కల్పిస్తూ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు.

వీధికుక్కల దాడిలో పలువురికి గాయాలు

చొప్పదండి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగంపేటలో బుధవారం వీధికుక్కలు దాడిచేసి నలుగురిని గాయపరిచాయి. దీకొండ లక్ష్మి, లింగమ్మ, సిర్ర రిషిక, దయ్యాల లస్మయ్యపై కుక్కలు దాడిచేసి గాయపరిచాయి. బాధితులకు చొప్పదండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమచికిత్స అందించి అనంతరం కరీంనగర్ సివిల్ ఆసుపత్రికి తరలించారు. వీధికుక్కలు ప్రమాదకరంగా తయారయ్యాయని, వెంటనే చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు.

జమ్మికుంటలో యువకులపై..


పిచ్చికుక్క దాడిలో గాయపడిన యువకుడు

జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని మోత్కుల గూడెం సమీపంలో గల నాయినిచెరువువద్ద బైక్ పై వెళ్తున్న ముగ్గురు యువ కులను పిచ్చి కుక్కల గుంపు వెంబ డించింది. అందులో ఒకపిచ్చి కుక్క దాడి చేయడంతో యువకుడి కాలికి తీవ్రగాయాల య్యాయి. మోత్కుల గూడెంకు చెందిన బిట్ల రాకేష్ అనే యువకుడు తన ఇద్దరు స్నేహితు లతో కలిసి బైక్‌పై వెళ్తున్నాడు. నాయిని చెరువు సమీపం వద్దకు రాగానే వారిని పిచ్చికుక్కల గుంపు వెంబడించింది. వెనుకాల కూర్చున్న రాకేష్‌పై ఓ పిచ్చికుక్క దాడిచేయడంతో ఎడమ కాలికి తీవ్రగాయాలు అయ్యాయి. స్నేహితులు వెంటనే అతన్ని జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. వైద్యులు ప్రాథమిక వైద్యం అందించారు.

శంకరపట్నంలో కుక్క, కోతుల దాడి

శంకరపట్నం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం కుక్క, కోతులదాడిలో పలువురు గాయపడ్డారు. కేశవపట్నం గ్రామానికి చెందిన స్రవంతి కుక్కదాడిలో గాయపడగా, చింతలపల్లికి చెందిన మల్లారెడ్డి, అంబాలాపూర్‌కు చెందిన మణెమ్మ, మొలంగూర్‌లో జ్యోతిపై కోతులు దాడిచేయడంతో గాయపడ్డారు. కేశవపట్నం పీహెచ్‌సీలో గాయపడిన వారు చికిత్స తీసుకున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్ తెలిపారు.

గల్ఫ్ పంపిస్తానని మోసగించిన వ్యక్తిపై చీటింగ్ కేసు

జగిత్యాల క్రైం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): గల్ఫ్‌దేశానికి పంపిస్తానని డబ్బులు తీసుకుని మోసగించిన ఒకరిపై జగిత్యాల పట్టణ పోలీసులు బుధవారం చీటింగ్ కేసు నమోదు చేశారు. ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి గ్రామానికి చెందిన దేశెట్టి రాకేష్ అనేవ్యక్తి ఉపాధికోసం గల్ఫ్ వెళ్లేందుకు జగిత్యాలకు చెందిన అల్లెపు వెంకటేష్ అనే వ్యక్తికి 2022 సంవత్సరంలో రూ.3.5లక్షల నగదు చెల్లించాడు. 2023 సంవత్సరంలో ఆర్మీనియా దేశానికి వెళ్లిన రాకేష్ కొద్ది నెలలకే అక్కడ ఉపాధి లేక స్వదేశానికి తిరిగి వచ్చాడు. తాను మోసపోయానని తెలుసుకుని గల్ఫ్ దేశానికి పంపించిన వెంకటేష్‌ను డబ్బులు తిరిగిచెల్లించాలని నిలదీశాడు. మరోసారి వెంకటేష్ మాయమాటలు విన్న రాకేష్ 2025 జనవరిలో థాయ్‌లాండ్ వెళ్లాడు. అక్కడ వెంకటేష్‌కు సంబంధించిన వ్యక్తులు రాకేష్‌ను కలిసి బ్యాంకాంగ్ తీసుకవెళ్లి సరైనఉద్యోగం చూపించకుండా ఓ సైబర్‌క్రైమ్ ముఠాకు అప్పజెప్పారు. దీంతో మరోసారి మోసపోయానని తెలుసుకున్న రాకేష్ ఇండియన్ ఎంబసీ సహాయంతో ఇటీవల స్వదేశానికి వచ్చాడు. తనకు జరిగిన మోసంపై రాకేష్ బుధవారం జగిత్యాల పట్టణపోలీసులకు ఫిర్యాదుచేయగా వెంకటేష్‌పైచీటింగ్ కేసునమోదుచేసినట్లు టౌన్‌సీఐవేణుగోపాల్ పేర్కొన్నారు.

దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు

వీణవంక, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామనికి చెందిన దొండపాటి సంపత్‌రెడ్డిపై దాడిచేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. సంపత్ రెడ్డి, ఇంటి ముందు గేటు నిర్మిస్తుండగా అదేగ్రామానికి చెందిన దొండపాటి భగవాన్ రెడ్డి, దొండపాటి పద్మ నానా భూతులు తిడుతూ పిల్లర్లు పగలగొట్టడంతో పాటు గడ్డపారతో సంపత్‌రెడ్డిపై దాడిచేయగా తలకు గాయాలయ్యాయి. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తోట తిరుపతి తెలిపారు.

ఒకరిపై కేసు నమోదు

తంగళ్లపల్లి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం సారంపల్లి గ్రామానికి చెందిన బుర్ర వికాస్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయం తాళం పగులగొట్టి న్యూసెన్స్ చేశాడని గ్రామ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

ముమ్మరంగా 'ఉపాధి' పనులు


మల్యాల మండలంలో వ్యవసాయ క్షేత్రాలకు ఏర్పాటు చేసిన రహదారి

జగిత్యాల జిల్లాలో మల్యాల నంబర్‌వన్
సగటున 44.11శాతం కూలీలకు పని

మల్యాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మల్యాల మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం మల్యాల మండలం జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలుస్తోంది. మండలంలోని 19 గ్రామాల పరిధిలో 10,593 మందికి జాబ్ కార్డులు ఉండగా ప్రస్తుతం 5,642 కూలీలు పని చేస్తున్నారు. కూలీలకు నిత్యం రూ.275 నుంచి రూ.300 వరకు వేతనం లభిస్తుంది. ఇటీవలి కాలంలో మండల వ్యాప్తంగా లక్షా 95వేల112 పని రోజులు పూర్తి కాగా సగటున 44.11శాతం కూలీలకు పని కల్పించారు. రూ.5.21కోట్ల వేతనాలు కూలీలు అందుకున్నారు. ఏడాదిలో 60 రోజులు పనులు పూర్తి చేసుకున్న వారిని ప్రత్యేకంగా గుర్తిస్తూ వంద రోజులు పూర్తి అయ్యేలా ప్రోత్సహిస్తున్నారు. ఉపాధిహామీ పథకం పనుల్లో భాగంగా పొలంబాట కార్యక్రమం కింద వ్యవసాయ భూములకు రహదారుల ఏర్పాటు, రైతుల వ్యవసాయ భూముల వద్ద నీటి నిలువ కుంటలు, పశువు పాకలు, చెరువు పూడికతీతలు, ఇంకుడుగుంతలు మామిడి ప్లాంటేషన్ లాంటి పనులు చేపడుతున్నారు.


ఉపాధి పనుల్లో చేపడుతున్న పశువుల పాక నిర్మాణం

కూలీలకు శిక్షణ

2021 నుంచి 2024 వరకు 100 రోజులు పని చేసుకున్న జాబ్‌కార్డు కుటుంబాలలో విద్యార్హతలను బట్టి 18-45 ఏళ్ల లోపు గల 70మందికి అధికారులు ఇటీవల పుట్టగొడుగుల పెంపకం శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్‌తో పాటు ముద్ర బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించడానికి చర్యలు తీసుకుంటున్నారు. గతంలోనూ మహిళలకు కుట్టు శిక్షణ, బ్యూటీషియన్ కోర్సు, టైలరింగ్, యువకులకు కంప్యూటర్, ఎలక్ట్రీషన్, ప్లంబింగ్ తదితర శిక్షణ ఇవ్వగా స్వయం ఉపాధి, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగావకాశాలు లభించాయి.

ప్రత్యేక పర్యవేక్షణ:శ్రీనివాస్, ఏపీవో, మల్యాల

ఉపాధిహామీ పనుల్లో జిల్లాలోనే మల్యాల ప్రథమ స్థానంలో నిలుస్తోంది. వంద రోజులకు సమీపంలో గల కూలీలను గుర్తించి వారంతా ఈజీఎస్ పనుల్లో పాల్గొనేలా నిత్యం పర్యవేక్షణ చేస్తున్నాం. కూలీల సంఖ్యను మరింత పెంచడం ద్వారా జిల్లాలో ప్రథమ స్థానాన్ని కొనసాగిస్తాం.

అక్రమంగా కట్టిన ఇల్లు సీజ్

సిరిసిల్ల టౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): అక్రమంగా కట్టిన ఇల్లును బుధవారం దేవాదాయ ధర్మాదాయశాఖ ఉమ్మడి కరీంనగర్ జిల్లా సహాయకమిషనర్ యన్ సుప్రియ సీజ్ చేయించారు. సిరిసిల్ల పట్టణం శ్రీలక్ష్మి వెంకటేశ్వర దేవాలయానికి చెందిన సర్వే నంబర్ 1578విస్తీర్ణం 1.38గుంటల భూమిలో 40సంవత్సరాల క్రితం అక్రమంగా కట్టి దాదాపు 30పక్కా నివాసగృహాలను దేవాదాయ ధర్మాదాయశాఖ ఉమ్మడి కరీంనగర్ జిల్లా సహాయకమిషనర్ సుప్రియ పరిశీలించారు. ఇటీవల హైకోర్టుఇచ్చిన ఉత్తర్వులను అనుసరించి ప్రతిఇంటికి రూ.1000 డ్యామేజ్ సూట్ కింద పేమెంట్ చేయాలని సూచించారు. డ్యామేజ్‌చార్జెస్ కట్టనియెడల నివాసగృహాలను కూడా సీజ్‌చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమంగా కట్టిన ఓనివా సగృహాన్ని సీజ్‌చేయించారు. అనంతరం దేవాలయానికి చెందిన 463సర్వేనంబర్ అండ్611 భూములను పరిశీలించారు.కార్యక్రమంలో ఈవో మారుతిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పశుగ్రాసం దగ్ధం

రాయికల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని శివాలయానికి సమీపంలో ఉన్న ఆవుల పోషణ నిమిత్తం దాతలు అందజేసిన పశుగ్రాసం దగ్ధమైంది. సుమారు రూ.50వేల వరకు నష్టం వాటిల్లినట్లు శివసేవకులు తెలిపారు. దాతలు ముందుకు వచ్చి పశుగ్రాసాన్ని అందజేయాలని కోరారు.

79క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యాన్‌తో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

కోల్‌సిటీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఫైవింక్లయిన్‌లో బుధవారం అక్రమంగా మహారాష్ట్రకు డీసీఎం వ్యాన్‌లో తరలిస్తున్న రేషన్‌బియ్యంను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది మాటువేసి వ్యాన్ (టీఎస్02 యూఏ1517)ను పట్టుకుని అందులో 79.5క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మంథనికి చెందిన రాచర్ల రమేష్, మహారాష్ట్ర సిర్వంచకు ఎల్లంకి వీరన్‌లు మంథని ప్రాంతం నుంచి రేషన్ బియ్యాన్ని డీసీఎం వ్యాన్‌లో అనుమానం రాకుండా సగానికి లోడ్‌చేసుకుని తరలిస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు. అనుమానం వచ్చి తనిఖీచేయగా రేషన్ బియ్యం పట్టుబడిందన్నారు. దేశెట్టి మారుతి(26) అనే డ్రైవర్‌ను పట్టుకోగా రాచర్ల రమేష్, ఎల్లంకి వీరన్, ఓదెల మహేందర్‌లు పరారీలో ఉన్నారన్నారు. డీసీఎం వ్యాన్ గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పట్టివేత

మంథనిరూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచి రేషన్ బియ్యాన్ని బుధవారం పట్టుకున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకింద సింగరేణి స్వాధీనం చేసుకున్న సిద్దపల్లి గ్రామంలోని ఓ ఇంట్లో తనిఖీ చేయగా 106 ప్లాస్టిక్ సంచుల్లో నిల్వ చేసిన 54.40 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉన్నాయన్నారు. వీటిని అక్రమంగా నిల్వ చేసిన ఎండీ రియాజ్‌ను విచారించగా తాను రేషన్‌కార్డు దారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి మహారాష్ట్రలో ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు తెలిపారన్నారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి రైతు మృతి


శ్రీనివాస్ (ఫైల్)

వెల్గటూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఎండపల్లి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన రైతు సంగ శ్రీనివాస్ (46) మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అడవి పందులు ఢీకొట్టడంతో అదుపుతప్పి కిందపడి మృతిచెందాడు. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం శ్రీనివాస్ వెల్గటూర్ మండలం ముత్తునూర్ నుండి కొండాపూర్ గ్రామానికి ఇల్లరికం వచ్చాడు. మంగళవారం రాత్రి కెనాల్ ద్వారా వస్తున్న నీటిని తన పొలానికి పెట్టడానికి ద్విచక్రవాహనంపై వెళ్లాడు. ఇంటికి తిరిగివస్తున్న క్రమంలో కొండాపూర్ గ్రామశివారులోని తొండం ప్రాంతంలో అడవి పందులు ఢీకొట్టడంతో కిందపడిపోయాడు. తలకు, ఇతరచోట్ల తీవ్రగాయాలు కావడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. బుధవారం మృతుడి కుమారుడు విష్ణువర్ధన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం


యాదగిరిరావు(ఫైల్)

కరీంనగర్ క్రైం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మానేరు బైపాస్‌రోడ్‌లో రాంచంద్రాపూర్ కాలనీ వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో హనుమాన్‌నగర్‌కు చెందిన వాల యాదగిరిరావు(57) దుర్మరణం చెందాడని కరీంనగర్ రెండోఠాణా పోలీసులు తెలిపారు. బైక్‌పై వెళ్తున్న యాదగిరిరావును వెనుకవైపు నుంచి కారు అతివేగంగా ఢీకొట్టడంతో కారు బ్యానెట్‌పై పడ్డాడు. అనంతరం కారు అదుపుతప్పి ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. దీంతో కారు, లారీల మధ్య ఇరుకున్న యాదగిరిరావు తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య భల్మారి శ్రీలక్ష్మి తిమ్మాపూర్ మండలం పర్లపెల్లిలో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తుండగా, కూతురు మెడికల్ విద్యనభ్యసిస్తున్నట్లు సమాచారం. మృతుడి భార్య ఫిర్యాదుతో కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ రెండో ఠాణా పోలీసులు తెలిపారు.

రాంనగర్‌లో పట్టపగలే చోరీ

- రూ.4లక్షల నగదు, రెండున్నర తులాల బంగారం అపహరణ

కోరుట్ల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని రాంనగర్‌లో అయిలాపూర్ పద్మరాణి అనే మహిళ ఇంట్లో పట్టపగలు చోరీ జరిగింది. పద్మరాణి పట్టణంలోని ఇందిరా రోడ్డులో సారి సెంటర్ నడుపుతోంది. మధ్యాహ్నం ఇంటికి తాళంవేసి దుకాణానికి వెళ్లింది. సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా రూ.4 లక్షల నగదు, రెండున్నర తులాల బంగారు అభరణాలు అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ రామచంద్రుడు సంఘటన స్థలాన్ని పరిశీలించి క్లూజ్ టీం సభ్యులతో తనిఖీలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు మృతి


సర్వర్ పాషా (ఫైల్)

మెట్‌పల్లి రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మండలం వేంపేట గ్రామశివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ లింగంపల్లి వెంకన్న(60) అనే వృద్ధుడు మంగళవారం రాత్రి మృతి చెందినట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి బుధవారం తెలిపారు. మల్లాపూర్ మండలం ముత్యంపేటకు చెందిన వెంకన్న ఫిబ్రవరి 25న మెట్‌పల్లిలో పనులు ముగించుకుని ముత్యంపేటకు ద్విచక్ర వాహనంపై బయలు దేరారు. ఈ క్రమంలో ఆర్టీసీ బస్సు వేంపేట గ్రామ శివారులో ఢీకొట్టగా వెంకన్నకు తీవ్ర గాయాలపాలయ్యాడు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న వెంకన్న మంగళవారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఆర్టీసీ డ్రైవర్ శ్రీనివాస్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని మృతుడి కుమారుడు అంజయ్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బతికెపల్లి గ్రామానికి చెందిన సయ్యద్..

పెగడపల్లి, మార్చి12(ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండలంలోని బతికెపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ సర్వర్ పాషా (55) చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 10న రాత్రి గ్రామంలో నడుచుకుంటూ వెళ్తుండగా కారు ఢీకొనడంతో సయ్యద్ సర్వర్‌పాషాకు తీవ్ర గాయాలయ్యాయి. కరీంనగర్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారు జామున మృతి చెందినట్లు తెలిపారు. కాగా అదేప్రమాదంలో గాయపడ్డ సర్వర్ పాషా సోదరుడు జాకీర్‌పాషా పరిస్థితి సైతం విషమంగా ఉన్నట్లు ఎస్‌ఐ రవికిరణ్ తెలిపారు.

అనారోగ్యంతో ఒకరి బలవన్మరణం

ముత్తారం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన చొప్పరి శ్రీనివాస్(48) అనేవ్యక్తి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై గోపతి నరేష్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలప్రకారం.. శ్రీనివాస్ కొంతకాలంగా అనారోగ్యంతోపాటు మతిస్థిమితం లేక ఆసుపత్రిలో చికిత్స చేయించుకుంటున్నాడు. ఇంట్లో ఎవరూలేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

ఇంకెన్నాళ్లీ ఎదురు చూపులు

- మూడు దశాబ్దాలుగా ఆర్టీసీలో సేవలు
- పదవీ విరమణ చేసి ఏళ్లు గడిచినా అందని బకాయిలు
- ఆర్టీసీలో రిటైర్డ్ కార్మికుల అరణ్యరోదన
- చనిపోయిన తరువాత ఇస్తారా అని ఆవేదన


డిపో ఎదుట ఆందోళన చేస్తున్న ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు

కళ్యాణ్‌నగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాల పాటు వారు ఆర్టీసీలో సేవలందించారు. పదవీ విరణ చేసిన తర్వాత వారికి ఆర్థిక భద్రత లేకుండాపోయింది. ఏళ్లు గడిచినా ఇప్పటి వరకు వారికి రావాల్సిన బకాయిలను యాజమాన్యం చెల్లించకపోవడంతో ఆర్‌టీసీ రిటైర్డ్ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1200 మంది రిటైర్డ్ కార్మికులకు రావాల్సిన బకాయిలను యాజ మాన్యం ఇప్పటి వరకు చెల్లించ లేదు. ఓ కార్మికుడు బకాయిలు వస్తాయో రావోనని మనోవేదనతో మృత్యువాత పడినా యాజమాన్యం స్పందించడం లేదు. గోదావరిఖని ఆర్టీసీ డిపోలో సుమారు వంద మంది పదవీ విరమణ చేయగా బెనిఫిట్స్ రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

2015 నుంచి ఫిక్సేషన్ అరియర్స్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ ఒక్కో కార్మికుడికి ఏడు లక్షల నుంచి 23 లక్షల రూపాయల వరకు రావాల్సి ఉంది. మృతి చెందిన కార్మికులకైనా అరియర్స్ చెల్లించాలని వేడుకున్నా యాజమాన్యం తమను పట్టించుకోవడలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నెల 24న ఆర్టీసీ రిటైర్డ్ కార్మికులు గోదావరిఖని డిపో ఎదుట ఆందోళనకు దిగి తమకు రావాల్సిన అరియర్స్‌ను చెల్లించాలని డిపో మేనేజర్ నాగ భూషణానికి వినతిపత్రం అందించారు. పదవీ విరమణ పొంది ఏడేళనా తమకు రావాల్సిన బకాయిలు రాకపోవడంతో మనోవేదనతో హనుమయ్య అనే డ్రైవర్ మృత్యువాత పడ్డాడు. పలువురు అనారోగ్యానికి గురై జీవితాన్ని గడుపుతున్నట్టు ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు వస్తాయో, రావోనని కలత చెందుతున్నారు. తమ సమస్యలను ఎండీకి విన్నవించినా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్ కూడా చాలా తక్కువ వస్తుందని, బకాయిలను చెల్లించే విధంగా కృషి చేయాలని వారు అధికారులను కోరుతున్నారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

చావే శరణ్యం...

నాగేందర్, రిటైర్డ్ ఆర్టీసీ కార్మికుడు



32ఏళ్లు ఆర్టీసీకి సేవ చేశాం. మాకు రావాల్సిన డబ్బులు ఇవ్వడం లేదు. రిటైర్డ్ అయి ఐదేళ్లు అయినా రూ.23 లక్షల వరకు బకాయిలు రావాల్సి ఉంది. వాటి వడ్డీ కలిపి అరియర్స్‌ను చెల్లించాలి. కుటుంబ పోషణ భారమవుతుంది.

పెన్షన్ కూడా తక్కువే..

కనకయ్య, రిటైర్డ్ ఆర్టీసీ కార్మికుడు



ఆర్టీసీలో నేను 22ఏళ్లు డ్రైవర్‌గా పని చేశా. పెన్షన్ కూడా తక్కువగానే ఉంది. పెన్షన్ రూ.2500 కూడా రావడం లేదు. దీనికి తోడు ఆర్టీసీ నాకు బెనిఫిట్స్‌ను కూడా ఇవ్వ లేదు. 2013 నుంచి ఆర్‌పీఎస్ బాండ్ బకా యిలు రావడం లేదు. రెగ్యులర్ ఎంప్లాయిస్‌కు నెల రోజుల్లోనే ఫ్రీక్వెన్సీ చేస్తున్నారు. మాకు మాత్రం కాలయాపన చేస్తున్నారు. ఇది సరైంది కాదు.

రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తాం...

తిరుపతి, రిటైర్డ్ ఆర్టీసీ కార్మికుడు



మాకు రావాల్సిన అరియర్స్ బకాయిలు చెల్లించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తాం. ఇప్పటికే పలు డిపోల్లో ఆందోళనలు మొదలయ్యాయి. అవసరమైతే విధుల్లో ఉన్న డ్రైవర్లు, కండక్టర్లతో కలిసి సమ్మెకు దిగుతాం.

మహిళా అఘోరీ హల్‌చల్..

- జిల్లా సరిహద్దులో రెండు గంటల పాటు ఉద్రిక్త పరిస్థితులు
- వేములవాడకు వెళ్లే ప్రయత్నాన్ని అడ్డుకున్న పోలీసులు


మహిళా అఘోరీని తరలిస్తున్న పోలీసులు

తంగళ్లపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మహిళాఅఘోరీ జిల్లా సరిహద్దుల్లో మరోసారి హల్‌చల్ సృష్టించింది. బుధవారం జిల్లా సరిహద్దులోని తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామశివారులో మహిళాఅఘోరీని పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. గతంలో వేములవాడ రాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్న సందర్భంలో దేవస్థానం ప్రాంగణంలో ఉన్నదర్గాను కూల్చివేస్తానని సంచలన వ్యాఖ్యలు చేసింది. ఈక్రమంలో గతనెల ఫిబ్రవరి3న కూల్చివేయడానికి రావడంతో ముందస్తుగానే జిల్లాసరిహద్దులో మహిళా అఘోరీని అడ్డుకొని సిద్దిపేటకు తరలించారు. మరోసారి వేములవాడకు మహిళా అఘోరీ వస్తుందని సమాచారంతో జిల్లాసరిహద్దులో భారీగా పోలీసులను మోహరించారు. సిద్దిపేట-సిరిసిల్ల ప్రధానరహదారిపై జిల్లెల్ల వద్ద 50మంది పోలీసులతో ప్రత్యేక పికెట్ ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్ని తనిఖీచేశారు. మధ్యాహ్నం నుంచే పోలీస్ చర్యలు మొదలవగా సాయంత్రం 5 గంటల ప్రాంతంలో జిల్లాసరిహద్దుకు మహిళా అఘోరీ వాహనం చేరుకోగా పోలీసులు అడ్డుకున్నారు. కారులోంచి దిగకుండా పోలీసులపై పరుష పదజాలంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ హల్‌చల్ చేసింది. తనను అడ్డుకుంటే కత్తితో చేతిని కోసుకుంటానని బెదిరించింది. దీంతో మహిళా పోలీసులు మహిళా అఘోరీని బలవంతంగా కారులోంచి దింపి శరీరంపై దుప్పటి కప్పారు. అనంతరం మహిళా అఘోరీని పోలీస్ వాహనంలో సిద్దిపేటకు తరలించారు. కారును టోషన్ సహాయంతో సిద్దిపేట వైపు తీసుకెళ్లారు. సీఐలు శ్రీనివాస్‌గౌడ్, సదన్ కుమార్, ఎస్‌ఐలతో భారీ బందోబస్తులో నిర్వహించారు.

కేజీబీవీ పాఠశాల విద్యార్థినికి గాయాలు

తిమ్మాపూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల పాఠశాల(కేజీబీవీ)లో 10వ తరగతి చదువుతున్న మానకొండూర్ మండలం గట్టుదుద్దెనపల్లికి చెందిన అనన్య ప్రమాదవశాత్తు గాయపడింది. స్థానికులు తెలిపిన వివరాలప్రకారం పాఠశాలలో బుధవారం రాత్రి విద్యార్థినుల మధ్య ఘర్షణ జరిగింది. పెనుగులాటలో అనన్యకు కిందపడగా గాయాలయ్యాయి. వెంటనే పాఠశాల సిబ్బంది అనన్యను ఆసుపత్రికి తరలించగా చేయి విరిగినట్లు గుర్తించారు. అసలు ఏం జరిగిందనే దానిపై అధికారులను తెలుసుకునే ప్రయత్నం చేయగా వారు స్పందించలేదు.

రాజన్న ఆలయంలో కామ దహన ఉత్సవం



కామదహనం నిర్వహిస్తున్న అర్చకులు, అధికారులు


వేములవాడ కల్చరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజ రాజేశ్వరస్వామి ఆలయ ఆవరణలో కామదహన ఉత్సవాన్ని అధికారులు ఘనంగా నిర్వహించారు. రాజన్న ఆలయ ఆవరణలో రాత్రి ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి కామ దహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాగా రాజన్న ఆలయ మండపంలో డోలోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డి



పెగడపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పెగడపల్లి ఎంపీడీవో ఎ.శ్రీనివాస్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డిని జిల్లా ఎంపీడీవోలు, మండల పరిషత్ ఉద్యోగులు అభినందించారు.

రైతులకు వరం
పీఎం కిసాన్ మన్‌ధన్



- 60 ఏళ్లు దాటిన రైతులకు పింఛన్
- 18 నుంచి 40 ఏళ్ల రైతులు అర్హులు
- రూ.55 నుంచి ప్రీమియం

చొప్పదండి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రధానమంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజన పథకం రైతులకు వరంగా మారనుంది. రైతులు వృద్ధాప్యంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయం చేయకున్నా వారు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం 'పీఎం కిసాన్ మాన్‌ధన్ యోజన' పథకాన్ని తీసుకువచ్చింది. వృద్ధాప్యంలోకి వచ్చాక చాలా మంది రైతులకు ఎలాంటి ఆదాయ వనరులు ఉండవు. ఈ నేపథ్యంలో వయస్సు పైబడిన చిన్న, సన్న కారు రైతులకు అండగా ఉండేందుకు కేంద్రం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద 60 ఏళ్లు నిండాక రైతులకు ప్రతి నెల 3 వేల రూపాయల చొప్పున పింఛన్ జీవిత కాలం అందుతుంది. 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న రైతులు ఈ పథకంలో చేరేందుకు అర్హులు. భూ రికార్డుల్లో తమ పేరు ఉం డి, రెండు హెక్టార్ల వరకు సాగు చేసేందుకు వీలుగా భూమి ఉన్నవారు ఈ పథకం కింద పేర్లు నమోదు చేసు కోచ్చు. ఎప్పుడు నమోదు చేసుకున్నా పెన్షన్ 60 ఏళ్లు దాటాకే వస్తుంది. నేషనల్ పెన్షన్ స్కీం, ఈఎస్ఐ స్కీం, ఈపీఎఫ్‌వో పరిధిలో ఉన్నవారు, ఏదైనా ఇతర చట్టబద్ధ సామాజిక భద్రతా పథకాల పరిధిలో ఉన్న వారు, ఉన్నత ఆర్థిక స్థితి కలిగినవారు, టాక్స్ పేయర్లు ఈ పథకానికి అర్హులు కాదు. ఈ పెన్షన్ అందే వరకు రైతులు కొంత ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. పథకంలో చేరే వారి వయస్సును బట్టి ప్రీమియం ఉంటుంది. రైతు చెల్లించినంతే ప్రభుత్వం కూడా తన వంతుగా బీమా కంపెనీకి నగదు జమ చేస్తుంది.

ప్రీమియం వివరాలు

18 నుంచి 40 సంవత్సరాల వయస్సులోపు రైతులు ఈ పథకానికి అర్హులు. ప్రతి నెల 55 రూపాయల నుంచి 200 రూపాయల వరకు ప్రీమియంను బ్యాంక్ ఖాతా నుంచి చెల్లించాల్సి ఉంటుంది. రైతు చెల్లించిన ప్రీమియం మొత్తానికి కేంద్ర ప్రభుత్వం సమానంగా చెల్లిస్తుంది. రైతు 55 రూపాయలు జమ చేస్తే ప్రతి నెల 110 రూపాయలు జమ అవుతుంది. 20 ఏళ్ల వయస్సు గల రైతులు 61 రూపాయల ప్రీమియం, 25 ఏళ్ల వారికి 80, 30 ఏళ్లకు 105, 35 ఏళ్లకు 150, 40 ఏళ్ల వయస్సు వారికి ప్రీమియం 200 రూపాయలుగా ఉంటుంది. రైతు మరణిస్తే భార్య ఈ పథకాన్ని కొనసాగించవచ్చు. 60 ఏళ్ల తరువాత రైతు మరణిస్తే భార్యకు 1500 రూపాయల పెన్షన్ వస్తుంది. రైతు ఫోటో, నివాస ధ్రువీకరణ పత్రం, ఆధార్, వయస్సు నిర్ధారణ, సాగు భూమి, ఆదాయం వంటి వివరాలను, పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. కాగా ఈ కిసాన్ మాన్‌దన్ పదకంలో చేరాలంచే కామన్ సర్వీస్ సెంటర్లలో రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.



దరఖాస్తు చేసుకోవడం ఇలా

- పీఎం కిసాన్ లబ్ధిదారులు కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ)లో పీఎం కిసాన్ కేఎంవై పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- రైతు మొదట తన ఆధార్ నంబర్ ఎంటర్ చేయాలి.
- పీఎం కిసాన్ పథకానికి నమోదైన బ్యాంక్ ఖాతా నుంచి ప్రీమియం డబ్బులను చెల్లించాలి. ప్రతి నెల ఆటోమెటిక్‌గా డబ్బులు ఖాతా నుంచి పథకానికి జమ అవుతాయి.
- నామినీ వివరాలను నమోదు చేయాలి.
- మాన్‌ధన్ దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకొని రైతు సంతకం చేసి పోర్టల్‌లో అప్లోడ్ చేయాలి.
- వెంటనే మీకు పీఎం కిసాన్ మాన్‌ధన్ పింఛన్ కార్డు జనరేట్ అవుతుంది. కార్డును డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- ప్రతి నెలా బ్యాంక్ ఖాతా నుంచి ప్రీమియం డబ్బులు పీఎం. కేఎంవై పథకానికి ఆటోమేటిక్‌గా జమ అవుతాయి.
- పీఎం కిసాన్ లబ్ధిదారులు కానట్లయితే సీఎస్‌సీలో మాన్యువల్‌గా దరఖాస్తు చేసుకొని ఫించన్ కార్డును డౌన్‌లోడ్ చేసకోవచ్చు.
- ప్రీమియం డబ్బును నగదు రూపంలో చెల్లించాలి. ఆ తరువాత బ్యాంక్ ఖాతాను జత చేసుకోవాలి.

ఆర్టీసీలో బదిలీలు, పదోన్నతులు

భగత్‌నగర్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో ఉద్యోగులకు పదోన్నతితోపాటు, బదిలీల ప్రక్రియ చేపట్టారు. ఈ మేరకు బుధవారం బస్ బస్‌భవన్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. కరీంనగర్-2 డిపో మేనేజర్‌గా పని చేస్తున్న విమలయ్యకు ఖమ్మం డిప్యూటీ రీజినల్ మేనేజర్‌గా పదోన్నతి కల్పించారు. బోధన డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న ఎం.శ్రీనివాస్‌ను కరీంనగర్ డపో-2 మేనేజర్‌గా బదిలీచేశారు. జగిత్యాల డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న జి.సునీతను గద్వాల్ డిపో మేనేజర్‌గా, ఆదిలాబాద్ డిపో మేనేజర్ కె.కల్పనను జగిత్యాలడిపో మేనేజర్‌గా, హుస్నాబాద్ డిపో మేనేజర్ వెంకటేశ్వర్లును కుషాయిగూడకు బదిలీ చేశారు. దిల్‌సుక్‌నగర్‌లో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్‌గా పనిచేస్తున్న ఎన్.వెంకన్నను హుస్నాబాద్ డిపో మేనేజర్‌గా బదిలీ చేశారు. హైదరాబాద్ సీటీఎస్‌గా పనిచేస్తున్న పీవీ రావును కరీంనగర్ డిప్యూటీ ఆర్ఎంగా బదిలీ చేసినట్లు ఆర్టీసీ అధికారులు పేర్కొన్నారు.

చదువుతున్న కాలేజీలోనే గంజాయి అమ్మకం

విద్యార్థి అరెస్టు.. 1.30 కిలోల సరుకు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): చదువుతున్న కాలేజీలోనే గంజాయి విక్రయిస్తున్న విద్యార్థిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి 1.30 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. జగిత్యాల జిల్లా కోరుట్ల ప్రాంతానికి చెందిన రాజు ఘటకేసర్‌లోని ఓ కళాశాలలో ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. గంజాయి సేవించడానికి అలవాటు పడిన అతడు అధిక ఆదాయం కోసం బీదర్ నుంచి గంజాయి తీసుకొచ్చి తాను చదువుతున్న కాలేజీలో విద్యార్థులకు విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ బృందం రాజును అరెస్ట్ చేసింది. నిందితుడి నుంచి 1.30 కిలోల గంజాయి, బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

బ్రహ్మోత్సవాల్లో భక్తుల రద్దీ

- గోదావరి నదిలో పుణ్య స్నానాలు
- స్వామి వారల సేవ ఊరేగింపు



స్వామివారల ఊరేగింపు

ధర్మపురి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో బుధవారం భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. రాత్రి వేళలో శ్రీ స్వామి లక్ష్మీ నరసింహ (యోగ, ఉగ్ర) స్వామి వారల సేవలను అశ్వ వాహనంపై ఊరేగింపు జరిపారు. స్వామి వారల సేవలు పుర వీధుల గుండా ఇసుక స్తంభం వద్దకు తీసుకు వచ్చి ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ వేద మంత్రాల మధ్య ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని శ్రీ లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ ఆలయాల్లో నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయం పక్షాన రైస్‌మిల్ యజమానులు, దాతల సహకారంతో 7 వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు జక్కు రవీందర్ సేవలు అందించారు. కార్యక్రమంలో ధర్మపురి సీఐ రాం నర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం కోశాధికారి రంగ శంకరయ్య, సత్రం కోశాధికారి జక్కు దేవేందర్ పాల్గొన్నారు.

రెండో రోజు ఆదాయం రూ.5,14,052

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయానికి బుధవారం రూ.5,14,052 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. ఇందులో స్వామి వారల వివిధ రకాల పూజల టికెట్ల విక్రయం ద్వారా 2,76,482, ప్రసాదాలు విక్రయం ద్వారా రూ 1,61,850 లభించగా, అన్నదానం కోసం భక్తులు, దాతల ద్వారా సేకరించిన రూ 75,720 విరాళాలు ఉన్నట్లు ఆయన వివరించారు.



చలవ పందిళ్ల కింద సేద తీరుతున్న భక్తులు

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో గురువారం రాత్రి 7 గంటలకు శ్రీ వేంకటేశ్వరస్వామి ఊరేగింపు సేవ ఉంటుంది. శేషప్ప కళావేదికపై రాత్రి స్థానిక కళాకారుడు గుండి జగదీశ్వర్‌శర్మ బృందంచే భక్తి సంగీత విభావరి తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు.

ధర్మపురి లక్ష్మీ నృసింహస్వామి దేవస్థాన ధర్మకర్తల మండలి నియామకం

ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి దేవాలయ 13 మంది సభ్యులతో కూడిన ధర్మకర్తల మండలిని నియమిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దేవాలయ కమిటీ సభ్యులుగా ఎదులపురం మహేందర్, బాదినేని వెంకటేశ్, బొల్లారపు పోచన్న, గుడ్ల రవీందర్, జక్కు రవీందర్, కొమురవల్లి పవన్ కుమార్, మందుల్ల మల్లేశ్, నేదునూరి శ్రీధర్, రాపర్తి సాయికిరణ్, సంబెట తిరుపతి, స్తంబంకాడి గణేష్ కుమార్, వొజ్జల సౌజన్య, అవ్వ సుధాకర్‌లను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. నేరెళ్ల శ్రీనివాసా చార్యులను ఎక్స్ అఫీషియో సభ్యుడిగా నియమిస్తూ ఆదేశాలు వచ్చాయి.





స్వామివారి ఊరేగింపులో పాల్గొన్న అర్చకులు, స్వామివారి దర్శనం కోసం ఆలయం బయట బారుల తీరిన భక్తులు

వైభవంగా పూర్ణాహుతి

కొండగట్టులో ముగిసిన పవిత్రోత్సవాలు




పూర్ణహూతి నిర్వహిస్తున్న వేదపండితులు

మల్యాల, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి సన్నిధానంలో బుధవారం పూర్ణాహుతి వైభవంగా జరిగింది. మూడు రోజులుగా కొనసాగుతున్న పవిత్రోత్సవాలు బుధవారంతో ముగిసాయి. స్వామి వారికి క్షీరాభిషేకం, సహస్ర నాగవల్లిదళ అర్చన, పట్టు వస్త్రాలంకరణ, దివ్య ప్రబంద పారాయణం, హవనం, పూర్ణాహుతి, దేవతా ఉద్వాసనం, శ్రీ స్వామి వారికి పవిత్రధారణ, మహదాశీర్వచనం, పండిత సన్మానం కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో పవిత్ర ప్రధానం, సహస్ర దీపాలంకరణ, గరుడ వాహన సేవ కార్యక్రమాలు అర్చకులు, వేదపండితులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో శ్రీకాంత్ రావు, ఆలయ స్థానాచార్యులు కపీందర్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, జితేంద్ర ప్రసాద్, రఘు ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్, ఉపప్రధానర్చకులు చిరంజీవి, మారుతీ, సిబ్బంది అశోక్, చంద్రశేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



పవిత్రల ఆలయ ప్రవేశం

సైలెంట్‌గా ఎటాక్




- పెరుగుతున్న కిడ్నీ బాధితులు
- ఆరోగ్యంగా జీవించడానికి మూత్రపిండాలు ప్రధాన పాత్రే..
- నేడు ప్రపంచ కిడ్నీ దినోత్సవం

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

కిడ్నీ జబ్బు మనుషులపై సైలెంట్ ఎటాక్ చేస్తుంది. ఎక్కువ శాతం బాధితులు ముందుగా లక్షణాలను గుర్తించకపోవడంతో కిడ్నీ ఫెయిల్‌కి కారణం అవుతుంది. కిడ్నీ సమస్యలు పెరిగిపోతున్న క్రమంలో ప్రపంచ కిడ్నీ ఫెడరేషన్, ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ నెఫ్రాలజీ అనే రెండు సంస్థలు కిడ్నీలపై అవగాహన కల్పించాలని ప్రతి సంవత్సరం మార్చి రెండవ గురువారం ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని నిర్వహిస్తూ వస్తున్నాయి. ప్రతి సంవత్సరం ఒక అంశాన్ని తీసుకోని ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఈ సంవత్సరం ముందస్తుగానే సమస్యను గుర్తించి నివారణ - సంరక్షణ అంశంగా ముందుక తీసుకువచ్చింది. చిక్కుడు గింజల ఆకారంలో.. పిడికిలి ప్రమాణంలో.. నడుముకు పైభాగంలో.. పక్కటెముకల కింద మన శరీరానికి రెండు వైపులా ఉండే మూత్రపిండాలు(కిడ్నీలు) ఆరోగ్యంగా జీవించడానికి ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ప్రతి రోజూ లీటర్ల కొద్దీ రక్తాన్ని శుద్ధి చేస్తూ, వ్యర్థ పదార్థాలను బయటకు పంపుతూ నిరంతరం పని చేస్తూనే ఉంటాయి. ఆహారపు అలవాట్లు, ఇతర కారణాలతో ఇప్పుడు ఎంతో మంది కిడ్నీల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు.

మూత్రపిండాల పనితీరు..

ప్రతి రోజూ కిడ్నీలు రెండువందల లీటర్ల రక్తాన్ని శుద్ధి చేసి రెండు లీటర్ల మలినాలను, అధికంగా ఉన్న నీటిని తీసివేస్తాయి. అలా ప్రతిరోజూ మూత్రపిండంలో 24 గంటలు బొట్టు బొట్టుగా నీరు మూత్రపిండాల్లో ఉత్పత్తి అవుతూనే ఉంటుంది. యురేటర్ అనే రెండు గొట్టాల ద్వారా మూత్రాశయానికి చేరుతుంది. ఈ సంచి నిండగానే మూత్ర విసర్జన చేసుకోవాలని మెదడులో ఆలోచన కలుగుతుంది. తినే ఆహారంలోని రక్త ప్రవాహం కలిసినప్పుడు అనవసరమైన పదార్థాలు కొన్ని రక్తంలో చేరుతాయి. అలా చేరిన మలినాలను మూత్రపిండాలు సత్వరం శరీరం నుంచి బహిష్కరించకపోతే విషపూరితం అవుతాయి. ఈ పనిని కిడ్నీలు చేస్తాయి.



మూత్రపిండాలకు హాని కలిగించే పరిస్థితులు..

మూత్రపిండాలు ప్రాణాపాయ స్థితికి కూడా చేరుకుంటాయి. దెబ్బలు తగలడం, మితిమీరిన రక్తపోటు, అధిక బ్లడ్‌షుగర్, కొన్ని రోగాలకు వాడే మందుల వల్ల మూత్రపిండాల ఆరోగ్యం దెబ్బతింటుంది. మంచి అలవాట్లు వీటిని నియంత్రిస్తాయి. బరువును అదుపులో పెట్టుకోవడం, పొగతాగడం మానటం వల్ల కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

కిడ్నీల్లో రాళ్లు..

కిడ్నీల్లో రాళ్ల తయారు కావడానికి ప్రధానంగా తినే ఆహారంలో కాల్షియం సాల్ట్స్, యూరిక్ యాసిడ్, ఆక్జలైట్, సిస్టిన్ మొదలైన పదార్థాలు ఎక్కువగా ఉండడం. మూత్రం మండలంలో లోపలి పొర దెబ్బతినడం, ఏ విటమిన్ లోపించడం, మూత్ర విసర్జనకు అవరోధం ఏర్పడడం, మూత్రమండలంలో ఇన్‌ఫెక్షన్స్ రావడం, మంచినీళ్ల తక్కువ తాగడం, ప్రోస్టేట్ గ్రంథి వాయడం జరుగుతుంది. రాళ్ల ఎక్కడున్నాయి అనే దాన్ని బట్టి లక్షణాలు వస్తాయి.

జాగ్రత్తలు పాటించాలి..

ముందుగా జబ్బు నిర్ధారణ చేసుకుని అల్ట్రాసౌండ్, ఎక్స్‌రే ద్వారా కూడా తెలుసుకోవచ్చు. చిన్నరాళ్లయితే కొంత కాలానికి వాటంతట అవే పోతాయి. అందుకోసం అధిక నీళ్ల తాగితే సరిపోతుంది. రాళ్ల ఉన్నాయని నిర్ధారణ తరువాత ఎక్కువ నీళ్ల తాగాలి. నొప్పి తగ్గడానికి పెయిన్ కిల్లర్స్ మాత్రలు, చీము కణాలుంటే యాంటీబయాటిక్స్ వాడాలి. చిన్న రాళ్లయితే మూత్రంలో పడిపోతాయి, పెద్దగా ఉంటే మూత్రపిండాలు చెడిపోకముందే సర్జరీ ద్వారా తీయించుకోవాలి. ఒకసారి రాళ్ల తీయించుకుంటే మళ్లీ రావని అనుకోవద్దు.



అన్ని రంగాల్లో డిజిటల్ పరివర్తన

గణేశ్‌నగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సమాజంలో మార్పునకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డిజిటల్ పరివర్తన అన్ని రంగాల్లో స్థిరమైన స్థానాన్ని సాధిస్తోందని శాతావాహన విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ అన్నారు. 'డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఏకీ క్యాటలిస్ట్ ఫర్ సస్టైనబుల్ బిజినెస్ డెవలప్‌మెంట్' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ శాతవాహన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో కొవిడ్ తర్వాత ప్రపంచ వ్యాప్తంగా డిజిటల్ వ్యాపారాలు పెరిగాయని, మారుమూల గ్రామాల్లోనూ డిజిటల్ లావాదేవీలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయంలో ఇలాంటి సమాకాలిన అంశాలపై సదస్సు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. గుప్తా లక్ష్మణ్ సెక్రెటరీ ఏబీఆర్ఎస్ మాట్లాడుతూ దేశం అభివృద్ధి పథంలో నడవడానికి విద్య ముఖ్యమైన సాధనమని, విద్యా రంగంలో సమూలమైన మార్పులు తేవడానికి ఆధునికతతో కూడిన అంశాలను జోడిస్తూ విద్యారంగాన్ని బలోపేతం చేయడం ముఖ్య ఉద్దేశమని అన్నారు. విశ్వేశ్వరరెడ్డి కలవల గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ ఫౌండర్ అండ్ చైర్మన్, ప్రొఫెసర్ శ్రీనివాసమూర్తి డైరెక్టర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ హైదరాబాద్, డాక్టర్ రవి జాస్పర్ ఇండస్ట్రీస్, విశ్వావిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవికుమార్ పాల్గొన్నారు.

రైతుల నిరసనలను పట్టించుకోని ప్రభుత్వం..



రిలే నిరాహారదీక్షలో మహిళా రైతులు

ఇల్లంతకుంట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సమస్య పరిష్కరించాలని రైతులు నిరసనలు చేపట్టినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మహిళా రైతులు పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని 11వ ప్యాకేజీలో భాగంగా ఎల్ఎమ్ 6 కెనాల్ పనులు పూర్తిచేయాలని పెద్ద లింగాపూర్ గ్రామసమీపంలో రైతులు చేపట్టిన రిలే నిరాహారదీక్ష బుధవారం 10వ రోజుకు చేరుకోగా దీక్షలో మహిళా రైతులు కూర్చున్నారు. పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టి పంటలు సాగుచేస్తే ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కెనాల్ పనులు పూర్తిచేసి సాగునీరు ఇవ్వాలని నిరసన చేపట్టినా ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రెండు మండలాల రైతుల దీక్షలు చేస్తున్నా ఎమ్మెల్యేలు రాకపోవడం బాధాకరం అన్నారు. సమస్య పరిష్కారం అయ్యేంత వరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. మహిళా రైతుల దీక్షకు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గన్నారం నర్సయ్య సంఘీభావం ప్రకటించారు.

బావిలో పడి రైతు మృతి

గొల్లపెల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు బావిలో పడి గొల్లపల్లి మండలం వెనుగుమట్ల గ్రామానికి చెందిన బండారి లక్ష్మణ్(46) అనే రైతు బుధవారం మృతిచెందాడు. లక్ష్మణ్ భార్య తెలిపిన వివరాల ప్రకారం మృతుడు గల్ఫ్ వెళ్లి ఇటీవల తిరిగి వచ్చాడు. బుధవారం తన పొలానికి నీరు పెట్టడానికి బావి వద్దకు వెళ్లాడు. మోటార్ స్విచ్ ఆన్ చేసినప్పటికీ నీరు రాకపోవడంతో పైపులో నీరు పోసే ప్రయత్నంలో బావిలో జారి మృతిచెందాడు. లక్ష్మణ్ భార్య గంగవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిర్ర సతీష్ తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

రాయికల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలోని రామాజీపేట గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా నిల్వ చేసిన పీడీఎస్ బియ్యాన్ని సివిల్ సప్లయిస్ అధికారులు బుధవారం పట్టుకున్నారు. 12 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని స్థానిక డీలర్‌కు అప్పగించారు. ఈ దాడుల్లో సివిల్ సప్లయిస్ డీటీ వరప్రసాద్, ఎఫ్ఐ రాజేంద్రప్రసాద్, ఆర్ఐ పద్మయ్య తదితరులు ఉన్నారు.

తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

బీర్‌పూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్‌కు చెందిన గొల్లపెల్లి శ్రీనివాస్ గౌడ్ అనే గీత కార్మికుడు బుధవారం ఉదయం తాడి చెట్టు నుంచి జారి పడగా తీవ్ర గాయాలయ్యాయి. తోటి గీత కార్మికులు శ్రీనివాస్‌ను జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

జగిత్యాల అర్బన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్‌కు చెందిన గొల్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ అనే గీత కార్మికుడిని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ బుధవారం జిల్లా ప్రధాన ఆస్పత్రిలో పరామర్శించారు. అనంతరం కండ్లపెల్లి గ్రామానికి చెందిన చంద్రయ్య, బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన కట్లకుంట తిరుపతిలు అనారోగ్యంతో బాధ పడుతుండగా పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు నారపాక రమేష్, జక్కినపల్లి శ్రీనివాస రావు ఉన్నారు.

కార్యదర్శి సంతకం ఫోర్జరీతో ఇల్లు రిజిస్ట్రేషన్

కథలాపూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇప్పపల్లిలో యాగండ్ల చిన్నరాజం అనే వ్యక్తి పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీతో ఇల్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. బస్టాండ్ సమీపంలో ఇద్దరు అన్నదమ్ములకు సంబంధించిన ఇల్లును తమ్ముడు చిన్నరాజం కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసి ధ్రువీకరణ పత్రం సృష్టించి ఇల్లును రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. అయితే ఈ మధ్యకాలంలో తమ్ముడు చిన్నరాజం అన్న, వదినెలపై ఆస్తి తగాదా విషయంలో గొడ్డలితో హత్యాయత్నంకు పాల్పడ్డాడు. ఈ వివాదం నేపథ్యంలో ఫోర్జరీ విషయం బయటపడింది. చిన్నరాజంపై కార్యదర్శి మహేశ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది.

పనిచేయని నిఘా నేత్రాలు

-గ్రామాల్లో మరమ్మతులు చేయించడంతో నిర్లక్ష్యం -పెరుగుతున్న దొంగతనాలు

కథలాపూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): దొంగతనాల నివారణలో కీలక పాత్ర పోషిస్తున్న సీసీ కెమెరాల ఏర్పాటులో గ్రామాలు తీవ్ర నిర్లక్ష్యం కనబరు స్తున్నాయి. గతంలో మండలంలోని దాదాపు 18 గ్రామాల్లో సీసీ కెమెరాలను ప్రధాన కూడళ్ళ వద్ద ప్రజాప్రతినిధులు, పోలీసులు సంయుక్తంగా కలిసి ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో దొంగతనాలను చాలా సందర్భాల్లో నివారించగలిగారు. ఆలయాల్లో అభరణాలు ఎత్తుకెళ్ళడం, ట్రాక్టర్లు, ఇళ్ళల్లో దొంగతనాలు జరిగిన సమయాల్లో సీసీ కెమెరాలు దొంగలను పట్టించాయి. అయితే గడిచిన ఏడాది కాలంగా సీసీ కెమెరాల నిర్వాహణను గాలికి వదిలేయడంతో ఎక్కడికక్కడ చెడిపోయాయి. దీంతో నిఘా నేత్రాలు నిద్దరోతున్నాయి.


గంభీర్‌పూర్‌లో పనిచేయని సీసీ కెమెరాలు

● ప్రచారం చేస్తున్నా ఫలితం శూన్యం

పోలీసులు వ్యాపారస్తులతో ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పాటు చేసి వీడీసీలను సమన్వయం చేస్తూ గతంలో ప్రధాన కూడళ్ళ వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం రెండు, మూడు గ్రామాలు మినహా ఎక్కడా సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. టీవీ కేబుల్‌తో లింకు కలిపి పోలీస్ స్టేషన్‌కు అన్ని గ్రామాల సీసీ కెమెరాలను అనుసంధానం చేశారు. ప్రతీ కదలికను పోలీసులు గమనించేవారు. మరికొన్ని గ్రామాల్లో డివిడిలను ఏర్పాటు చేసి అదే ప్రాంతంలో రికార్డు చేసేవారు. వ్యాపారులు తమ దుకాణాల వద్ద కెమెరాలను పెట్టుకోవాలని చెబుతున్నా పెడచెవిన పెడుతున్నారు. కాలనీల్లో ఆయా కాలనీ వాసులు తమ జాగ్రత్తల కోసం ప్రధాన నాలుగు రోడ్ల కూడళ్ళలో ఏర్పాటు చేసుకోవాలని విస్తృతంగా ప్రచారం చేస్తున్నా విస్మరిస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

● గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్నాం -నవీన్‌కుమార్, ఎస్సై



నాణ్యమైన అధునాతన కెమెరాలను గ్రామాల కూడళ్ల వద్ద ఏర్పాటు చేస్తే దొంగతనాలను నివారించుకోవచ్చని వివరిస్తున్నాం. వ్యాపారులు, ఎన్ఆర్ఐలు, గ్రామాభివృద్ధి కమిటీలు ముందుకు వచ్చి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచి స్తున్నాం. ఊట్‌పల్లిలో ఇటీవల మహిళ ఇంట్లోంచి ఇద్దరు యువతులు బంగారం ఎత్తుకెళ్తుండగా సీసీ కెమెరా ద్వారా పట్టుకోగలిగాం. పాత వాటికి మరమ్మతులు చేయించి అన్ని గ్రామాల్లో కొత్తగా కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని వివరిస్తున్నాం.

తైబజార్‌ను రద్దు చేయాలని వినతి


కమిషనర్ మనోహర్‌గౌడ్‌కు వినతిపత్రం ఇస్తున్న చిరు వ్యాపారులు

రాయికల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలో తైబజార్‌ను రద్దు చేయాలని కోరుతూ చిరు వ్యాపారులు బుధవారం మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్‌కు వినతి పత్రం సమర్పించారు. వ్యాపారాలపై ఆధారపడి జీవిస్తున్న తమను ఇబ్బందులకు గురి చేసి డబ్బులు వసూలు చేస్తున్నారని, జగిత్యాలలో తైబజార్‌ను గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో రద్దు చేశారన్నారు. అదేవిధంగా రాయికల్‌లో కూడా తైబజార్‌ను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేష్, మాజీ సర్పంచ్ ఎద్దండి భూమారెడ్డి, నియోజకవర్గ యూత్ కో ఆర్డినేటర్ కొయ్యడి మహిపాల్, హనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్ దాసరి గంగాధర్, బత్తిని భూమయ్య, షాకీర్, కడకుంట్ల నరేష్, బత్తిని నాగరాజు, రాకేష్ నాయక్, బొమ్మకంటి నవీన్ పాల్గొన్నారు.

ముందస్తు హోలీ వేడుకలు

రాయికల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలో వాసవి కిట్టీ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ముందస్తు హోలీ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా మహిళలు ఒకరినొకరు రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహాల మధ్య గడిపారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

రాయికల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అన్ని రంగాల్లో ఎదగాలని పాఠశాల సముదాయం ప్రధానోపాధ్యాయుడు కాపు శ్రీనివాస్ అన్నారు. రాయికల్ పట్టణంలోని బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పదవ తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశం, చెరుకు మహేశ్వర శర్మ, రాజశేఖర్, అయిత పద్మ, గుండేటి తరంగిణి, పి.రమేష్, సృజన తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి కుటుంబానికి చేయూత

కోరుట్ల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : బాలికల జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తూ అనారోగ్యంతో మృతిచెందిన అబ్దుల్ ముజీబ్‌కు బుధవారం పీఆర్‌టీయు యూనియన్ సభ్యులు ఆర్థిక చేయూతను అందించారు. అబ్దుల్ ముజీబ్ కుటుంబ సభ్యులకు రూ.1,00,000 విలువ గల చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు అనందరావు, ప్రదాన కార్యదర్శి అమర్‌నాథ్ రెడ్డి, సంఘ సభ్యులు అబ్దుల్ వాజిద్, జక్కుల నవీన్, సుదీర్, మహేష్, అడ్లగట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

డబ్బులు ఇప్పించాలని బాధితుల ఆందోళన


నిర్వాహకుడి ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

జగిత్యాల అర్బన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): క్రిప్టో మెటాఫండ్ ప్రోలో పెట్టుబడి పెట్టి మోసపోయామని, తమ డబ్బులు ఇప్పించాలని కొడిమ్యాలకు చెందిన పలువురు బాధితులు బుధవారం జగిత్యాలలోని మెటా ఫండ్ నిర్వాహకులు కస్తూరి రాకేష్, శ్యాంసుందర్‌ల ఇంటి ఎదుట ఆందోళన చేశారు. ఈసందర్భంగా బాధితులు రాజు, వసంత మాట్లాడుతూ అత్యధిక వడ్డీ వస్తుందని చెప్పి తమతో పాటు పలువురి వద్ద రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు మెటాఫండ్‌లో పెట్టుబడి పెట్టించారన్నారు. గత సంవత్సరం ఆగస్టు 7వ తేదీ వరకు రోజుకు 5 డాలర్ల చొప్పున తమకు డబ్బులు వచ్చాయన్నారు. అనంతరం డబ్బులు రావడం నిలిచిపోయిందన్నారు. ఈ విషయమై నిర్వాహకులు రాకేష్‌ను సంప్రదిస్తే క్రైన్ స్టోర్ అనే యాప్‌లో క్రిప్టో మెటా ఫండ్ ప్రో లిస్ట్ అయిందని, తర్వాత డబ్బులు వస్తాయని నమ్మబలికాడని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బుల విషయమై రాకేష్ ఇంటికి వస్తే అతడి భార్య 100కు కాల్ చేసి పోలీసులను పిలిపించిందన్నారు. డబ్బుల విషయం మాట్లాడదామని రాకేష్ పిలిస్తేనే తాము వచ్చామని బాధితులు తెలిపారు.

పాఠశాలల్లో ఏఐ బోధన

(5వ పేజీ తరువాయి)

సరలమైన మార్గంలో... అయ్యిందంటే మరికొంత మెరుగైన పద్ధతిలో బోధన అందిస్తుంది. ఇలా ప్రతి విద్యార్థి అభ్యసన సామర్థ్యా లను మదింపు చేయడంతో పాటు, మునుపటితో పోలిస్తే పురోగతి ఎలా ఉందో పరిశీలించి నివేదికను తయారు చేస్తారు.

పకడ్బందీగా ఏఐ బోధన అమలు చేస్తాం



జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో కృతిమ మేథ బోధనను పకడ్బందీగా అమలు చేయడానికి ఏర్పాట్లు చేశాం. జిల్లాలోని 21 పాఠశాలల్లో విద్యార్థులకు ఏఐ తరగతులను నిర్వహించడానికి ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఇప్పటికే జిల్లా సమన్వయకర్తకు, ఇతర ఉపాధ్యాయులకు శిక్షణ సైతం పూర్తి చేశాము. ఈనెల 15వ తేదీ నుంచి ఏఐ తరగతులను ప్రారంభించనున్నాం.

-రాము, జిల్లా విద్యాధికారి

శిక్షణను పూర్తి చేసుకున్నాం..



జిల్లాలో ఒక్కో మండలంలో ఒక్కో పాఠశాలలో తొలి విడతగా ఏఐ తరగతులను నిర్వహించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఇప్పటికే హైదరాబాద్‌లో అవసరమైన శిక్షణను సైతం పూర్తి చేసుకున్నాం. ప్రభుత్వం ఏఐ బోధనపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రభుత్వ లక్ష్యం మేరకు విద్యార్థులకు ఏఐ బోధనను అందించడానికి ప్రయత్నాలు చేస్తున్నాం.

-బండారి మధు, మండల విద్యాధికారి, జగిత్యాల

పాత ఇంటికి మున్సిపల్ అనుమతి


పది సంవత్సరాల క్రితం నిర్మించిన ఇల్లు

జగిత్యాల అర్బన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని ధర్మపురి రోడ్డులో పది సంవత్సరాల క్రితం నిర్మించిన ఇంటికి మార్చి 1 పట్టణ మున్సిపల్ అధికారులు అనుమతులు ఇవ్వడం వివాదస్పదం అవుతున్నది. జగిత్యాల పట్టణంలోని ఒకటో వార్డులోని సర్వే నంబర్ 62లో పది సంవత్సరాల క్రితం ఏనుగుల రాజమల్లయ్య అనే వ్యక్తి మున్సిపల్ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే ఇంటిని నిర్మించాడు. మూడు అంతస్తుల భవనంలో నివాసం ఉండడంతో పాటు క్రింద దుకాణాలను నిర్వహిస్తున్నారు. అయితే ఇప్పటికే నిర్మించిన ఇంటికి కొత్తగా నిర్మాణ అనుమతులు ఇవ్వడం ఏంటని పలువురు అధికారులను ప్రశ్నిస్తున్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

పది సంవత్సరాల క్రితం నిర్మించిన ఇంటికి మార్చి ఒకటో తేదీన నిర్మాణ అనుమతులు ఇవ్వడంపై జగిత్యాల పట్టణానికి చెందిన చిగుర్ల బగవాన్ అనే యువకుడు బుధవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. రోడ్డును ఆక్రమించి నిర్మాణం చేసిన రాజమల్లయ్యపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు.

తప్పుదోవ పట్టించారు: మున్సిపల్ కమిషనర్

పాత ఇంటికి ఇప్పుడు అనుమతిపై జగిత్యాల మున్సిపల్ కమిషనర్ చిరంజీవిని వివరణ కోరగా పట్టణంలోని ధర్మపురి రోడ్డులో భవనానికి అనుమతులు ఇచ్చిన విషయం నిజమేనన్నారు. అయితే ఇంటి ఓనరు ఖాళీ స్థలం ఫొటోలు పెట్టి నిర్మాణానికి అనుమతులు తీసుకుని తమను తప్పుదోవ పట్టించారని, ఈ విషయమై విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

బాధితుడికి ఆర్థిక సహాయం

కొడిమ్యాల, మార్చి12(ఆంధ్రజ్యోతి) : కొడిమ్యాల పట్టణానికి చెందిన చొక్కాల సాయికుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కరీంనగర్‌లో చికిత్స పొందుతుండగా సామాజికవేత్త తుడి లచ్చన్న బుధవారం 10వేల రూపాయలను కొడిమ్యాలలోని టీఎల్ యువసేన సభ్యులకు పంపారు. బాధితుని తల్లికి టీఎల్ యువసేన సభ్యులు రాజశేఖర్, రాకేష్, శ్రీదర్, పోచమల్లు లక్ష్మీనారాయణ, లక్ష్మీనర్సయ్య, నాగరాజు నగదును అందించారు.

పౌష్టికాహారం సక్రమంగా అందించాలి

-డీడబ్ల్యూవో నరేష్


అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీడబ్ల్యూవో నరేష్

పెగడపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాలలో గర్బిణీలకు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికా హారం సక్రమంగా అందించాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి నరేష్ పేర్కొన్నారు. బుధవారం పెగడపల్లి మండలం లోని రాములపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని డీడబ్లువో నరేష్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారుల హాజరు శాతం పెంచాలని, పౌష్టికాహారం సక్రమంగా అందించాలని సూచిం చారు. హాజరు రిజిష్టర్, స్టాక్ రిజిష్టర్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో వీరలక్ష్మి, సూపర్ వైజర్లు సుబద్ర, పవిత్ర తదితరులు ఉన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు 20 వరకు గడువు

కోరుట్ల రూరల్, మార్చి12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూర్ మాడల్ స్కూల్‌లో 2025- 2026 విద్యా సంవత్సరం 7 నుండి 10వ తరగతి వరకు గల మిగులు సీట్లకు ప్రవేశం కోసం దరఖాస్తులకు ఈనెల 20 వరకు గడుడు ఉన్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ బీమనాతి మోహన్ బుధవారం తెలిపారు. పాఠశాల ప్రవేశం కోసం ఆన్‌లైన్ గవర్నమెంట్ వెబ్‌సైట్ ద్వారా అర్హత గల కోరుట్ల మండల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

-జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షురాలు దావ వసంత

సారంగాపూర్, మార్చి12 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలు నెరవేర్చాలని జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షురాలు దావ వసంత సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన తులం బంగారం హామీ ఏమైందని జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షురాలు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సారంగాపూర్ మండలంలోని పోచంపేట గ్రామానికి చెందిన కేసీఆర్ అభిమాని ఏనుగుల ఒక్కపొద్దు ఆనారోగ్యంతో మృతిచెందగా కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాడ సానుభూతి వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా తిరుగు ప్రయాణంలో బీడీ కార్మికుల వద్దకు వెళ్ళి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కల్వకుంట్ల కవిత సహకారంతో బీడీ కార్మికులకు పింఛన్ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో ఇస్తానన్న తులం బంగారం, నెలకు 4వేల పింఛన్, మహిళలకు, 2500, ఆడ బిడ్డలకు స్కూటీ, ఇలా కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారంటీల అమలులో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఈ సందర్భంగా కేసీఆర్ ప్రభుత్వ హయంలోనే అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని మహిళలు చెప్పడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తేలు రాజు, నాయకులు గంగారెడ్డి, శ్రీనివాస్, రమేష్, మల్లేష్, గంగాధర్, నరేష్, సురేష్, మహిళలు పాల్గొన్నారు.

యాదవుల హక్కుల సాధనకు పోరాటం

రాయికల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): అత్యధిక జనాభా ఉన్న కులాల్లో రాష్ట్రంలోనే రెండో స్థానంలో ఉన్న యాదవులకు జనాభా దామాషా ప్రకారం యాదవులకు న్యాయపరంగా దక్కాల్సిన హక్కులపై పోరాడుదామని యాదవ సంఘం అడహక్ కమిటీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు గనవేని మల్లేష్ యాదవ్ అన్నారు. మండలంలోని అయోధ్య, ఉప్పుమడుగు గ్రామాల్లో యాదవ సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మంది సభ్యత్వం తీసుకోగా జిల్లా కార్యవర్గ సభ్యుడు యాదవనేని రాజలింగం, మండల ఇన్‌ఛార్జిలు గంగవేణి కొమురయ్య యాదవ్, తాలూకా రాజేష్ యాదవ్‌లతో కలిసి సభ్యత్వ రశీదులను అందించారు. ఈ కార్యక్ర మంలో సంఘం సభ్యులు ఒర్రె మల్లేశం యాదవ్, కాసవేణి మహేష్ యాదవ్, తాలూకా రాజేశం యదవ్, గంగన్న యాదవ్, భూపతి రాజేందర్ యాదవ్, ఒర్రె రమేష్ యాదవ్, దుగ్గిళ్ల కుమార్ యాదవ్, సుమలత యాదవ్, జల యాదవ్, నర్సు యాదవ్, జమున యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'మొరం తవ్వకాలు ఆపాలి'

జగిత్యాల అర్బన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలో జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలు, ఇసుక మాఫియా, వరద కాలువ నుంచి మొరం తరలింపులను నిలువరించాలని జగిత్యాల జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు చిత్తారి ప్రభాకర్ మార్నింగ్ చైర్మన్ ఈరవత్రి అనిల్‌కు విన్నవించారు. జగిత్యాల జిల్లాలో పలువురు గల్ఫ్ బాధితులను పరామర్శించడానికి వచ్చిన ఆయనను కలిసిన మాల మహానాడు నాయకులు జిల్లాలో వరద కాలువ నుంచి నిత్యం వేలది ట్రిప్పుల మొరం తరలించడంతో వరద కాలువ కరకట్టలు మాయమవుతున్నాయని ఆయనకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షులు తోట జగన్, నర్ర రాజేందర్ తదితరులు ఉన్నారు.

పిరమిడ్ అక్రమ కట్టడాన్ని కూల్చివేయాలి

రాయికల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైతాపూర్ గ్రామ శివారులోని అక్రమ పిరమిడ్ కట్టడాన్ని కూల్చివేయాలని, గ్రామ శివారులో ఓ గుడిసెలో చేస్తున్న అన్యమత ప్రచారాన్ని నిలిపివేయాలని హిందూ చైతన్య వేదిక, ఆలయాల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం పంచాయతీ కార్యదర్శి వేణుకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో హిందూ చైతన్య వేదిక, ఆలయాల పరిరక్షణ కమిటీ సభ్యులు క్యాషనూరి మఠం జగదీశ్వర్, బూస గంగ మల్లయ్య, సద్ది మహిపాల్, బేతి సత్యనారాయణ, దేశవేణి శ్రీనివాస్, శివనీతి కిష్టయ్య, పాలడుగు లింగారెడ్డి, రామన్న పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్


కోరుట్ల పోలీసుల అదుపులో ఉన్న మాజీ సర్పంచ్‌లు

కోరుట్ల రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల్లో పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడి పిలుపు నేపథ్యంలో పోలీసులు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్‌లను బుధవారం ముందస్తు అరెస్టు చేశారు. మాదాపూర్ గ్రామ మాజీ సర్పంచ్, సర్పంచ్ ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, నాగులపేట మాజీ సర్పంచ్ బాస్కర్ రెడ్డిలతో పాటు వివిధ గ్రామ బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి పోలీసులు తీసుకున్నారు.

● గ్రామపంచాయతీలో పెండింగ్‌లో ఉన్న బిల్లులు మార్చి 15లోపు చెల్లించాలని లేకుంటే ఆమరణ దీక్షకైనా వెనుకాడమని కోరుట్ల మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ ప్రధాన కార్యదర్శి, కల్లూర్ మాజీ సర్పంచ్ వనతడుపుల అంజయ్య ప్రభుత్వాని హెచ్చరించారు. బుధవారం విలేకర్లతో వనతడుపుల అంజయ్య మాట్లాడారు. గ్రామ పంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని మంత్రులు, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకపోయినా పట్టించుకున్న పాపాన పోవడం లేదని ఆరోపించారు.

● ధర్మపురి: ధర్మపురి మండలంలోని మాజీ సర్పంచులను బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఉదయం వేళలో ఎస్ఐ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు మాజీ సర్పంచుల ఇంటికి వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల అదుపులో పెద్దనక్కలపేట, బూరుగుపల్లె, తిమ్మాపూర్ మాజీ సర్పంచులు మొగిలి శేఖర్, కంది తిరుపతి, కాళ్ల శేఖర్ తదితరులు ఉన్నారు.

● మెట్‌పల్లి రూరల్ : మండలంలోని మాజీ సర్పంచ్‌లను మెట్‌పల్లి పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. మెట్లాచిట్టాపూర్ మాజీ సర్పంచు బద్దం శేఖర్‌రెడ్డి, ఆత్మకూర్ మాజీ సర్పంచ్ భర్త చౌటుపల్లి అంజయ్య లను అరెస్టు చేసి మెట్‌పల్లి పోలీసు స్టేషన్‌కు తరలించారు.

● వెల్గటూర్: మాజీ సర్పంచ్‌లను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంచంద్రం గౌడ్ మండిపడ్డారు. బుధవారం అసెంబ్లీ ముట్టడికి వెళ్లుతున్నారనే సమాచారం మేరకు తాజా మాజీ సర్పంచ్‌లు బోడకుంటి రమేష్, బాలుసాని రవి, నాయకులు రాంచంద్రంగౌడ్, రాజేశ్వర్‌రెడ్డి, తిరుపతిలను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని వారు కోరారు.

ఆర్టీఏ కార్యాలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలి


ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆర్టీఏ మెంబర్ శ్రీనివాస్

జగిత్యాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో రవాణా శాఖ కార్యాలయ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కేటాయించాలని కోరుతూ జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్‌కు జిల్లా ఆర్‌టీఏ మెంబర్ కమటాల శ్రీనివాస్ వినతి పత్రం అందజేశారు. బుధవారం పట్టణంలోని నివాసంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను కలిసి సమస్యను విన్నవించారు. జిల్లా కేంద్రంలో రవాణా శాఖ కార్యాలయం లేకపోవడం వల్ల ఇటు ప్రజలకు అటు ఉద్యోగులు, సిబ్బందికి ఏర్పడుతున్న ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. జిల్లా కేంద్రంలో సుమారు 10 ఎకరాల స్థలాన్ని కేటాయించాల్సిన అవసర ముందన్నారు. ఆటోమేటిక్ టెస్టింగ్ ఫిట్నేస్ స్టేషన్, సైంటిఫిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్, ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్, వెహికల్ సీజర్ యార్డులకు స్థలం అవసర ముందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అడు వాల లక్ష్మణ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

రాయికల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటిక్యాల గ్రామంలో స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో రాయికల్ మండల క్రికెట్ సీజన్-4 టోర్నమెంట్‌ను బుధవారం మాజీ ఎంపీపీ కాటిపెల్లి గంగారెడ్డి టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత అన్ని రంగాల్లో ముందుండాలని అన్నారు ఈ టోర్నమెంట్‌కు విన్నర్, రన్నర్‌కు దాతలుగా నిలిచిన కాటిపెల్లి శ్రీనివాస్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌కు దాతలుగా వేల్పుల లక్ష్మణ్, హరీష్‌లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చైర్మన్ కాటిపెల్లి నారాయణ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ చంద్రశేఖర్, కల్లెడ వేణు, ఆర్గనైజర్‌లు గోపిడి రాజు, పెండెం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బీర్‌పూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు బీర్‌పూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుదర్శన్ సూచించారు. బుధవారం పాఠశాలలో పీఎం శ్రీ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులచే స్వచ్ఛ పక్వాడ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పాఠశాలలో వాడుకోవడానికి తీసుక వచ్చిన వస్తువులపై అవగాహన కల్పించారు. తడిచెత్త , పొడి చెత్త బుట్టలు వాడే విధానం గురించి తెలియజేశారు. ప్లాస్టిక్ కవర్లు, సంచులు వాడకాన్ని నిషేధించాలని, చేతులు పరిశుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. కార్యకంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ శ్రీలత, ఉపాధ్యాయులు రమాదేవి, నాగరాణి, స్వరూప, లలిత, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

కథలాపూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంభీర్‌పూర్‌లో నరసింహ స్వామి ఆలయంలో 38వ వార్షికోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేదపండితులు స్వస్తి వచనం, దీక్షా స్వీకారం, అంకురారోపణ, కుల దేవతా స్థాపన వంటి కార్యక్రమాలతో ఉత్సవాలను ఆరంబించారు. ఈనెల 14 దాకా ఆలయంలో ఉత్సవాలు కొనసాగుతాయని కమిటీ చైర్మన్ జవ్వాజి చిన్నసాయన్న తెలిపారు. జాతరకు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు